# టీ పెలారి



"టక్ టక్ టక్ మంటూ ఒక బల్లమీది నుంచి మరొక బల్ల మీదికి పరుగులు పెడుతోంది శబ్దం బల్లమీద టక్‌మని శబ్దం వినిపించగానే ఫైలులో తలదూర్చి కూర్చున్న ఆ గుమాస్తా తలఎత్తి ఎదురుగా ఉన్న వస్తువును చూసి సంతోషంతో గ్లాసులోని మంచినీళ్ల గటగటా తాగేయడం రోజూ జరిగేపని

అదొక చిన్న సైజు పెద్ద ఆఫీసు మొత్తం ఒక యాభైమంది రకరకాల చిన్న పెద్ద ఉద్యోగులున్నారు వారందరూ వరుసగా క్రమంలో కూర్చుని ఉన్నట్లే ఉంటారు కానీ గుడిలోని నవగ్రహాల్లా ఒకరి ముఖం మరొకరికి కనపడకుండా కూర్చుంటారు

గడియారం సరిగ్గా 3 గంటలు కొట్టింది టక్ టక్ శబ్దం మొదలయింది ఆ శబ్దం ఎగురుకుంటూ సూపరింటిండెంట్ బల్ల మీదకివచ్చి ఆగింది అయితే ఆ శబ్దంతోపాటు ఖ ఖ ఖ అన్న గ్లాసుల శబ్దం ట్వింగ్ ట్వింగ్ మన్న ట్రే క్రిందపడేటప్పుడయే శబ్దం అన్నీ ఒక్కసారిగా వినిపించాయి

ఏదో అలౌకికమయిన ధ్యానంతో పని చేసుకుంటున్న ఉద్యోగులందరూ ఒక్కసారిగా తలలు ఎత్తి శబ్దాలు వచ్చిన వేపు చూసారు అందరూ తననే చూస్తున్నట్లు అనిపించి సూపరింటిండెంట్ బాబోయ్ నేనేం చెయ్యలేదు అన్నట్లుగా తల విసురుగా తిప్పేసుకున్నాడు అందరూ మామూలు ధోరణిలోకి వచ్చి అసలు విషయం కనిపెట్టారు

టీ కుర్రాడు ట్రే నిండా టీ నింపిన గ్లాసులు పెట్టుకుని దాని మీద మరో ట్రే మూత పెట్టుకుని అందరి బల్లల మీద టీ గ్లాసులు ప్రతి రోజూ పెట్టుకుంటూ వచ్చేవాడు అలాగే ఆ రోజు కూడా అందరికీ టీ ఇస్తూ సూపరింటిండెంట్ టేబుల్ మీద టీ గ్లాసు పెట్టబోతుండగా ట్రేలోని ఒకగ్లాసు ఒరిగి టీ అంతా ట్రేలో ఒలికిపోయింది

కానీ
అప్పుడే మొదలయింది అసలు కథ

ఆ టీ కుర్రాడు ఓపిగ్గా మిగిలిన టీ గ్లాసులన్నింటినీ భద్రంగా సూపరింటిండెంట్ టేబిల్ మీద వరసగా పేర్చాడు తరవాత పడిపోయిన గ్లాసుని భద్రంగా తీసి ఒలికి పోయిన టీని దానిలోకి వంచాడు గ్లాసులోకి మళ్ళీ కొలత సరిపోయింది

రెప్ప వెయ్యడంకూడా మరిచిపోయి అందరూ వాడు చేస్తున్న పనినే చూస్తున్నారు ఆ గ్లాసుని కూడా వాడు భద్రంగా సూపరింటిండెంట్‌గారి టేబుల్ మీద ఒక వారగాపెట్టాడు

సూపరింటిండెంట్‌కి కొంచెం కోపం వచ్చింది ఆయనకి ప్రతి గ్లాసూ కళ్లజోడు లోంచి రెండుగా కనిపిస్తున్నది

ఏంటయ్యా జలతరంగిణి వాయించే వాడి ముందు నీళ్ల కప్పులు పెట్టినట్లుగా వీటిని నా ముందు పెట్టావ్ తీ తీ అని విసుక్కున్నాడు

జలతరంగిణి కాదు సార్' టీ తరంగిణి అన్నాడు హెడ్ గుమాస్తా సన్నగా

కిసుక్కున నవ్వింది టైపిస్ట్ పక్కకి తిరిగి

మళ్లీ టక్ టక్ మంటూ శబ్దం చేస్తూ టీ గ్లాసులు అందరి టేబుళ్ల మీదికి ప్రత్యక్షం అవుతున్నాయి

బల్ల మీద పెడుతున్న టీ గ్లాసుల్ని చూసి అందరూ కొండ చిలువను చూసినట్లు గబుక్కున బయపడి మళ్ళీ తెప్పరిల్లి సూపరింటిండెంట్ టేబుల్ మీద మూలగా ఉన్న గ్లాసు చూసి తృప్తిగా గాలి పీల్చి గ్లాసందుకుని టీ త్రాగు తున్నారు ఎంగిలి గ్లాసులూ మంచి గ్లాసులూ సమానంగా పెట్టుకుని వెళ్లే ట్రేలోని టీ ఎవరి కయినా ఇచ్చేస్తాడేమోనని అందరికీ ఒకటే దడ

ఎలాగయితే నేం ఆ గ్లాసు ఎవరికీ ఇవ్వకుండా మిగిలిన గ్లాసులు అందరికీ పంచిపెట్టి ఒకసారి అందరి ముఖాలలోకీ చూసి ఓ చిరునవ్వు నవ్వి ఆ గ్లాసుని భద్రంగా ట్రేలో పెట్టుకుని మూత మరింత జాగ్రత్తగాపెట్టుకుని వెళ్ళి పోయాడు

అందరి మనసుల్లోనూ ఆ క్షణంలో నే ఒకే ప్రశ్న ఉదయించింది

ఆ గ్లాసు ఎవరికయినా ఇవ్వడు కదా? అని ఇంతలో మరో ఆలోచన కూడా వచ్చింది ఇలా ఎక్కడయినా జరిగితే అటువంటి గ్లాసు తెచ్చి ఇక్కడ ఇవ్వడు కదా? అని

అంతే

అందరికీ కడుపులో దేవినట్టయింది రేపటి నుండీ టీ త్రాగ కూడదు అనుకున్నారు

పాపం టైపిస్ట్ తట్టుకోలేక ఓక్ అంది

అందరూ కంగారు పడిపోయారు

అబ్బే ఆవిడ ఓక్‌కి కారణం టీ అయి ఉండదు లెండి అన్నాడు క్రొత్తగా చేరిన కుర్ర గుమాస్తా

ఆవిడ ఈ మధ్యే ఆరు నెలల క్రిందట మంచి టెండల్లో ఓ 20 వేలు కట్నం తీసుకున్న ఓ మొనగాణ్ణి పెళ్ళి చేసుకుంది లెండి □